08032025-MAI-06_Layout 1 3/8/2025 3:17 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# గాడి తప్పిన పాలనకు హెచ్చరిక



జి.దేవీప్రసాద్ రావు

**గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన తీర్పు కాంగ్రెస్ పాలనపై ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లకు గల వ్యతిరేకతకు అద్దం పడుతున్నది. కరీంనగర్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చావో రేవో అన్నట్టుగా ప్రచారం చేసింది. ఏడుగురు మంత్రులు, 24 మంది శాసనసభ్యులు నెల రోజులకు పైగా ప్రచారం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి ముఖ్యమంత్రి స్వయంగా గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒకవైపు ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో 8 మంది కార్మికులు చిక్కుకుపోతే, ఘటనా స్థలానికి వెళ్లి సమీక్ష నిర్వహించకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ప్రజలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. తమ 15 నెలల పాలన నచ్చితే ఓటు వెయ్యాలని ప్రచారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్, అదే సమయంలో తాము ఒక్క సీటు గెలవకపోయినా పోయేదేమీ లేదని ఓటర్లను బెదిరించే ప్రయత్నం చేశారు. విజ్ఞులైన ఓటర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి గాడి తప్పుతున్న పాలనను సరిచేసుకోవాలని హెచ్చరించారు. 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ఆరు గ్యారెంటీలు అమలు చేశామని చెప్పిన అబద్ధాలు, గ్రాడ్యుయేట్ ఓటర్లు అర్థం చేసుకొని బుద్ధి చెప్పారు.**

కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కానీ, ఏ ఒక్క హామీనీ సంపూర్ణంగా నెరవేర్చలేదు. పైగా, కేసీఆర్ ప్రభుత్వ పథకాల అమల్లోనూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. అన్నీ సగంసగం చేసి చేతులు దులుపుకొన్నారు. రుణమాఫీ కథ కంచికి వెళ్లింది. రైతు భరోసా ఎగవేసింది. కౌలు రైతులకు కన్నీరు మిగిల్చింది. విద్యుత్తు పరిస్థితి తీరని వ్యథలాగా మారింది. శాంతి భద్రతలు దిగజారాయి. గురుకులాల్లో విద్యార్థులకు భద్రత ఉండటం లేదు. మూసీనది పునరుజ్జీవం పేరుతో పేద ప్రజలకు ముప్పు తెచ్చి పెట్టారు. హైడ్రా పేరిట హైడ్రామా నడుపుతున్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం ఇది.

రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా ఉన్న ఉద్యోగులు, నిరుద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. అధికారంలోకి రాగానే ఆరు నెలల కాలంలో పీఆర్సీ అమలు చేస్తామని, డీఏ విడుదల చేస్తామని, హెల్త్ కార్డులు జారీ చేస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి ఒక డీఏను మాత్రమే విడుదల చేసి సర్దుకోమని చెప్పడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో వారు న్యాయం కోసం కోర్టుకెక్కారు.

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఐదారు వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసి, గత ప్రభుత్వంలో ప్రాసెస్ చేసి నిలిచిపోయిన 45 వేల ఉద్యోగాలకు నియామకాలు ఇచ్చి తమ ఖాతాలో వేసుకొని గొప్పలు చెప్పి కాలం గడిపారు. జాబ్స్ లేని క్యాలెండర్‌తో నిరుద్యోగులను మోసం చేశారు. నిరుద్యోగ సమస్యలపై పోరాడిన విద్యార్థులపై చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ, అశోక నగర్‌లో లాఠీఛార్జ్ చేసి, అరెస్టులు చేసి హైదరాబాద్‌ను నిరుద్యోగుల శోక నగరంగా మార్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంఘం నేతలు పిలుపునివ్వడం కొంత మేర పనిచేసింది. గ్రాడ్యుయేట్ ఓటర్లు ప్రసన్న హరికృష్ణ వైపు నిలబడటం వల్ల గణనీయమైన ఓట్లు సాధించారు. బీజేపీ, కాంగ్రెస్ వ్యతిరేక గ్రాడ్యుయేట్లు కూడా ప్రసన్నకే ఓట్లు వేశారు. ఇక, కుల గణనలో అన్యాయం జరిగిందని తీన్మార్ మల్లన్న సహా బీసీ సంఘాలు ప్రకటించినా, ప్రభుత్వం మాత్రం తమ లెక్కే కరెక్ట్ అని దబాయిస్తున్నది. బీసీ కులాల సంఖ్యను తగ్గించి వారికి అన్యాయం చేసే కుట్ర చేస్తున్నదన్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని, చర్చకు రావాలని బీసీ 'జాక్' ప్రకటించింది. సర్వేలో వేసిన ప్రశ్నలు ప్రజలను బెదిరించేలా ఉన్నాయని ప్రజలు భావించారు. కేసీఆర్,



కేటీఆర్, హరీశ్‌రావు సర్వేలో పాల్గొనలేదని పదే పదే చెప్పడం సమస్యను పక్కదారి పట్టించడమే. రిజర్వేషన్లను రాష్ట్రాల యూనిట్‌గా నిర్ణయించే అధికారం ఆయా రాష్ట్ర శాసనసభలకు ఉండే ఉండాలని కేసీఆర్ అనేక సందర్భాల్లో చెప్పారు.కానీ కేంద్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా జటిలం చేసే ప్రయత్నం చేసింది.

ఇక, ఉపాధ్యాయ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి మింగుడుపడటం లేదు. రెండు స్థానాల్లోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా మారిన జనసమితి ప్రతిపాదించిన ఇద్దరూ పరాజయం పాలయ్యారు. నల్లగొండ జనసమితి అభ్యర్థికి 34 నియోజకవర్గాల్లో 24 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అయిన అభ్యర్థి పోటీచేసి ఓడిపోయారు. కాంగ్రెస్ మద్దతుతో పోటీచేసిన వామపక్ష అభ్యర్థి పరాజయం చెందారు. తీన్మార్ మల్లన్న బలపరిచిన బీసీ అభ్యర్థులు కూడా గెలువలేక పోయారు. దీనిని బట్టి ప్రభుత్వంతో సంబంధం ఉన్న ఏ అభ్యర్థినీ ఉపాధ్యాయులు ఆదరించలేదు.

317 ఉత్తర్వులను సరిచేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం, పీఆర్సీ అమలు, కరువుభత్యం కంచికి చేరడంతో పాటు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విసిగి పోయిన ఉపాధ్యాయుల మనోగతాన్ని ఎన్నికలు స్పష్టంగా సూచించాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఓటు ద్వారా డిమాండ్ చేసిన ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి మారాలని కోరుకుందాం. అయితే, ఉపాధ్యాయ ఉద్యమాలతో, సమస్యలతో ఎలాంటి సంబంధం లేని కార్పొరేట్ తరహా వ్యక్తులు ఎన్నికలలో విజయం సాధించడం ఆందోళన కలిగిస్తున్నది.

ఎన్నికల్లో డబ్బు ప్రభావం తీవ్రం కావడంతో పెద్దల సభకు పేదలు ఇక ముందు రావడం కష్టమనే విషయం స్పష్టం అవుతున్నది. గతంలో అనేకమంది విద్యావేత్తలు, మేధావులు, ఉద్యమకారులు గెలిచి ఎమ్మెల్సీలు అయ్యారు. కానీ ఇప్పుడు కార్పొరేట్ వ్యక్తులు రంగంలోకి దిగుతున్నారు. ఇదే ధోరణి కొనసాగితే తెలంగాణ భవిష్యత్తు ఏమైపోతుందోనన్న ఆందోళన కలగకమానదు. ఎన్నో సామాజిక ఉద్యమాలు, పోరాటాలు నడిపి దేశానికే ప్రత్యామ్నాయం చూపించిన తెలంగాణ తప్పకుండా ఇలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొని రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని ఆశిద్దాం. ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవగాహన కల్పించలేకపోవడం వల్లే దాదాపు 28,000 ఓట్లు చెల్లకుండా పోయాయి. రాజకీయ పార్టీల నాయకులు సైతం ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యం ఓటుపై అవగాహన కల్పించడంలో చూపించలేదు. గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియలో సమూల మార్పులు రావాలి. 25 లక్షలకు పైగా ఉన్న గ్రాడ్యుయేట్లలో కేవలం 3.55 లక్షల మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. ప్రతిసారి ఓటును నమోదు చేసుకోవడం తప్పనిసరి కావడంతో ఓటర్లు అంతగా ఆసక్తి చూపడం లేదు. వార్డు సభ్యుడికి సైతం ఎన్నికల ఖర్చుపై పరిమితి విధిస్తున్న ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో విధించకపోవడం వల్ల ఖర్చు కోట్లు దాటుతున్నది. వందల కోట్లు ఖర్చు పెట్టి గెలవగల అభ్యర్థులకు ఎన్నికల సంఘమే రాచబాట వేయడం విషాదం.

**ఎన్నికల్లో డబ్బు ప్రభావం తీవ్రం కావడంతో పెద్దల సభకు పేదలు ఇక ముందు రావడం కష్టమనే విషయం స్పష్టం అవుతున్నది. గతంలో అనేకమంది విద్యావేత్తలు, మేధావులు, ఉద్యమకారులు గెలిచి ఎమ్మెల్సీలు అయ్యారు. కానీ ఇప్పుడు కార్పొరేట్ వ్యక్తులు రంగంలోకి దిగుతున్నారు. ఇదే ధోరణి కొనసాగితే తెలంగాణ భవిష్యత్తు ఏమైపోతుందోనన్న ఆందోళన కలగకమానదు. ఎన్నో సామాజిక ఉద్యమాలు, పోరాటాలు నడిపి దేశానికే ప్రత్యామ్నాయం చూపించిన తెలంగాణ తప్పకుండా ఇలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొని రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని ఆశిద్దాం.**

(వ్యాసకర్త: టీఎన్జీవో పూర్వ అధ్యక్షుడు)



# సర్కారును మహిళలు నమ్మేదెలా?



తుల ఉమ

**రాష్ట్రంలోని మహిళా సమాఖ్యల పేరిట బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చేలా ప్రభుత్వం అనుమతులు జారీచేసింది. మొత్తం 600 బస్సులు కొనుగోలు చేయాలని, అందుకోసం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ-సెర్ప్ నుంచి తొలి విడతగా రూ.54 కోట్లు విడుదల చేసింది.**

మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని 2023, డిసెంబర్‌లో ప్రారంభించిన రేవంత్ ప్రభుత్వం ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేయటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఈ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో డిపోలు, బస్టాండ్‌ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జీరో టికెట్ల జారీ ద్వారా ప్రతి నెలా సుమారు రూ.400 కోట్లు ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్నది. ఈ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవంతో పేరుకుపోతూనే ఉన్నాయి. గతంలో కంటె ఆక్యుపెన్సీ నిష్పత్తి భారీగా పెరిగినప్పటికీ అవన్నీ కాగితాల మీదే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన వందల కోట్ల బకాయిలు ఆర్టీసీకి వచ్చినప్పుడే ఆ సంస్థ లాభాల్లోకి వెళ్లి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించగలుగుతుంది.

**ఇలా సొంత కార్పొరేషన్‌కే బకాయిలు ఇవ్వని ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి వాళ్లకు మాత్రం ఏడేండ్లు క్రమం తప్పకుండా ఇవ్వాల్సిన నిధులను ఇస్తుందా అన్నది అనుమానమే. మహిళా సంఘాలను ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకువెళ్తామని చెప్తున్న ప్రభుత్వం మాటలను మహిళలు ఎలా నమ్మేది?. ఇప్పటికే కిలోమీటర్‌కు అత్యంత తక్కువ కోట్ చేసిన వాళ్ల బస్సుల్నే అద్దెకు తీసుకున్న ఆర్టీసీ వ్యవహార శైలి వల్ల బస్సుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 40 శాతం మంది అద్దె బస్సుల యజమానులు తమ వాహనాలను ఒప్పందం నుంచి తప్పించి విద్యాసంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి మొత్తం 10 వేల బస్సులుండగా అందులో 3,300 బస్సులు ఒప్పంద ప్రాతిపదికన తీసుకున్నవే. సుమారు వెయ్యి బస్సులు తమ ఒప్పందం నుంచి తప్పుకున్నాయి. కొన్నిసార్లు కార్పొరేషన్ లాభాలు లేని రూట్లలో ఉన్న అద్దె బస్సుల సంఖ్యను తగ్గిస్తున్నది.**

అద్దె బస్సులకు గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.150 కోట్ల చెల్లింపులు బాకీ ఉన్నది. ఇప్పుడు మహిళా సంఘాల ద్వారా తీసుకుంటున్న బస్సులకు మాత్రం సమయానికి చెల్లిస్తారన్న నమ్మకం కలగడం లేదు. మరోవైపు ఆర్టీఏల దగ్గర ప్యాసింజర్ బస్సులను, విద్యార్థులను చేర్చే బస్సులుగా మార్చే దరఖాస్తులు ఎక్కువవుతున్నాయి. అంటే కార్పొరేషన్‌తో పాటు అద్దె బస్సు యజమానులు ఆయా రూట్లలో బస్సులను నడిపించటానికి ఇష్టపడటం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన విధానాల ప్రకారం మహిళాసంఘాల బస్సుల నిర్వహణ ఆర్టీసీ చూసుకొని ప్రతి నెల రూ.77 వేలు చెల్లించనున్నది. వాళ్ల చేత బస్సులు కొనుగోలు చేయించి ఈఎంఐలు సరిగ్గా కట్టేలా ఆర్టీసీ, ప్రభుత్వం ఎంతవరకు సహకరిస్తాయన్నది సందేహాస్పదం. మరోవైపు ఏకంగా 637 బస్సులు 15 ఏండ్ల కాలాన్ని పూర్తిచేసుకున్నాయి. వీటితో సంస్థ నిర్వహణ భారంగా మారింది. ప్రతిసారి బస్సులు రోడ్లపై ఆగిపోవటం రిపేర్లు, నిర్వహణ సరిగ్గా లేకపోవటం వల్ల ఇంధనం ఖర్చు పెరుగుతున్నది. మహిళా సమాఖ్యలు కొనుగోలు చేసే బస్సులు మండల స్థాయిలో తిప్పుతామని ఆర్టీసీ స్పష్టం చేసింది. లాభాలు లేని రూట్లలో ఈ బస్సులు తిప్పటం వల్ల కొన్నేండ్లలోనే ఆ బస్సులు నష్టాలను చూపే ప్రమాదం ఉన్నది.

ఆర్టీసీ ఇలా అద్దెకు తీసుకున్న బస్సులను డిమాండ్ ఉన్న దారుల్లో నడిపినప్పుడే మహిళా సంఘాల బస్సులు లాభాలు ఆర్జిస్తాయి. అవసరమైతే ఈ 450 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చులు తగ్గి ఆ మేరకు ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. కానీ, ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం వల్ల బస్సుల నిర్వహణ, రిజిస్ట్రేషన్, ఇంధన ఖర్చులు, దారులపై ఎలాంటి అవగాహన లేని మహిళా సమాఖ్యలు ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అందుకే వాళ్లకు సరైన రీతిలో అవగాహన, శిక్షణ కల్పించాలి. ఆర్టీసీ సైతం అద్దె బస్సులపైనే కాకుండా సొంతంగా బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్టు నడిపించాలి. కాలం తీరిన బస్సుల స్థానంలో నూతనంగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలి.

(వ్యాసకర్త: కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్)



# అయోమయంలో భారత యువత!



వి.వి.వెంకటేశ్వరరావు
63008 66637

**డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, అభ్యంతరాలతో భారత యువత అయోమయంలో పడింది. 'దూరపు కొండలు నునుపు' అన్నట్టు తయారైంది అగ్రరాజ్యంలోని ఉన్నత విద్య. ప్రపంచం మొత్తం తమ చెప్పుచేతల్లో ఉండాలని భావిస్తున్న ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ఇతర దేశాలకు మరణ శాసనంగా మారుతున్నాయి.**

2024, మే నాటికి దేశం వెలుపల నివసిస్తున్న భారతీయుల సంఖ్య దాదాపు 3.5 కోట్లు. ఇందులో సుమారు 1.58 కోట్ల మంది నాన్ రెసిడెంట్ ఇండియన్లు (ఎన్ఆర్ఐ). యూకే, కెనడా, అమెరికా, జర్మనీ, జపాన్, మలేషియా, దక్షిణాఫ్రికా, యూఏఈ, సౌదీ అరేబియా, సింగపూర్, మారిషస్, మయన్మార్ వంటి దేశాల్లో భారతీయులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎక్కుమంది విద్యార్థులే. దశాబ్దాలుగా సాగుతున్న ఈ సంప్రదాయానికి ట్రంప్ మంగళం పాడారు. అమెరికాలో చదువుకొనే విద్యార్థులు బుద్ధిగా చదువుకోవాలి తప్పితే పార్ట్‌టైం ఉద్యోగాలు చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ఇది భారత్ సహా అనేకదేశాల విద్యార్థులకు శరాఘాతంగా మారింది. వర్క్ వీసా తో అమెరికా వెళ్లి పనిచేస్తున్న వారి కంటే ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లి ఖర్చుల వెతలు తీర్చుకొనేందుకు పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్న వారే ఎక్కువ. ఎలాంటి ధ్రువీకరణ పత్రాల్లేకుండా అక్కడ నివసిస్తున్న వందల మంది భారతీయులను ఇటీవల భారత్‌కు తరలించారు.

అమెరికా నుంచి పెద్ద ఎత్తున వెనక్కి వస్తున్న వారితో దేశంలో నిరుద్యోగ సమస్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. 2024, జూన్ నాటికి దేశంలో నిరుద్యోగిత రేటు 9.2 శాతంగా ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. జీ-20 దేశాల నిరుద్యోగిత రేటులో భారత్ మూడో స్థానంలో ఉన్నది. మరోవైపు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ నిరుద్యోగం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. 2024, మేలో గ్రామీణ ప్రాంతాల్లో ఇది 6.3 శాతం ఉండగా, జూన్ నాటికి 9.3 శాతానికి ఎగబాకింది. పట్టణ ప్రాంతాల్లో అదే ఏడాది మే నెలలో 8.6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు జూన్ నాటికి 8.9 శాతానికి పెరిగింది. కార్మిక భాగస్వామ్య రేటు (లేబర్ పార్టనర్‌షిప్ రేట్) మేలో 40.8 శాతం ఉండగా జూన్ నాటికి 41.4 శాతానికి పెరిగింది. 2024, జూన్‌లో ఉపాధి రేటు 38 శాతం నుంచి 37.6 శాతానికి దిగజారింది.

ఈ నేపథ్యంలో భారత్‌లో నిరుద్యోగ సమస్య మరోమారు భయపెట్టే అవకాశం కనిపిస్తున్నది. ఎన్నో ఆశలు పెట్టుకొని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అమెరికా వెళ్లిన యువత ఇప్పుడు ఏం చేయాలో పాలుపోని స్థితిలో కూరుకుపోయింది. పార్ట్‌టైం ఉద్యోగాలతో చదువులు నెట్టుకొస్తున్న యువత చదువు ముందుకుసాగేదెలానో తెలియక అల్లాడిపోతున్నారు. ఇప్పటికే తమ కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టలేక తమలో తామే మథనపడుతున్నారు. అమెరికా నుంచి వచ్చిన వారి వివరాలు ప్రభుత్వం వద్ద ఉంటాయి కాబట్టి తక్షణమే వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. భయాందోళనల మధ్య భారత్ చేరుకున్న వారిలోని నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకుని స్టార్టప్‌లు నెలకొల్పేందుకు సాయం చేయాలి. అలా చేయడం వల్ల ఒకరిద్దరికే కాకుండా వారి ద్వారా మరెంతోమంది నిరుద్యోగులకు ఆసరా లభిస్తుంది. కాబట్టి ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోవాలి.

# శ్రీపతి.. యువతకు ఆదర్శం



శిరందాసు నాగార్జునరావు
94402 22914

మహిళా దినోత్సవ ప్రత్యేకం

**మనసుపెట్టి కష్టపడితే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని నిరూపించింది ఓ గిరిజన యువతి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యువతీయువకులు తెలుసుకోవాల్సిన ఓ చదువుల తల్లి జీవితం ఇది. రెండు రోజుల బిడ్డతో పోటీ పరీక్షకు హాజరై విజయం సాధించింది. స్వతంత్ర భారతదేశంలో 77 ఏండ్ల తర్వాత తమిళనాడులో మొట్టమొదటి మహిళా గిరిజన న్యాయమూర్తిగా రికార్డుకెక్కింది. ఆ ఎస్టీ యువతి పేరు వి.శ్రీపతి.**

తమిళనాడులోని తిరువన్నామలై దగ్గర జువ్వాది పర్వతశ్రేణుల మధ్య ఉన్న గిరిజన గూడెం పులియూర్ గ్రామానికి చెందిన 23 ఏండ్ల శ్రీపతి తండ్రి కాలియప్పన్, తల్లి మల్లిక. శ్రీపతికి ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. చెన్నై నుంచి 250 కిలోమీటర్ల దూరంలో ఏ మాత్రం సౌకర్యాలు లేని ఆ గ్రామంలో ఆమె తల్లిదండ్రులు పోడు వ్యవసాయం చేసుకొని జీవించేవారు. వారు ఎక్కడికైనా వెళ్లడానికి బస్సు ఎక్కాలంటే 15 కిలో మీటర్లు నడవాలి. అంతటి మారుమూల గిరిజన గ్రామం అది. వారిది 'మలయలి' అనే అత్యంత వెనుకబడిన గిరిజన తెగ. ఆ తెగలో అమ్మాయిలను చదివించడం, బయటకు పంపడంపై అనేక ఆంక్షలు ఉన్నాయి. శ్రీపతి తల్లిదండ్రులు వాటిని పట్టించుకోలేదు. పిల్లలను చదివించాలన్న కోరిక వారిలో బలీయంగా ఉన్నది. ఆ గూడెంలో పాఠశాల, కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో పిల్లల చదువు కోసం వారు తిరుపత్తూరు జిల్లా ఎలగిరి హిల్స్‌కు దగ్గరలోని 'అత్నావర్' అనే పల్లెకు వలస వెళ్లారు. అక్కడ కూడా పోడు వ్యవసాయమే చేసేవారు. పిల్లల చదువు ముఖ్యమనుకున్నారు. యలగిరి హిల్స్‌లో మంచి స్కూల్ ఉందని సంతోషించారు. శ్రీపతి ప్రాథమిక విద్య, ఇంటర్ అక్కడే అభ్యసించింది.

కలియప్పన్ పర్యాటక ప్రదేశాల్లో హౌస్ కీపింగ్ వంటి పనులు చేసేవారు. శ్రీపతి చదువులో బాగా రాణించింది. మంచి మార్కులతో ఉత్తీర్ణురాలవుతూ ఉండేది. ఉన్నత చదువులు చదవాలన్నది ఆమె కోరిక.




ఇంటర్‌లో మంచి మార్కులతో పాసైంది. ఆమె పట్టుదలను చూసి తల్లిదండ్రులు ఆమెను తిరువణ్ణామలైలో 5 సంవత్సరాల లా కోర్సులో చేర్పించారు. అయితే, కుటుంబ నేపథ్యం, బంధువుల ఒత్తిడి వల్ల శ్రీపతికి చిన్న వయసులోనే వెంకట్రామన్ అనే యువకుడితో పెండ్లి చేశారు.

**వివాహమైనా శ్రీపతి చదువు మాత్రం ఆపలేదు. పట్టుదల వీడలేదు. డాక్టర్ అంబేద్కర్ లా విశ్వవిద్యాలయంలో పీజీ చేసింది. అప్పుడే తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగాల భర్తీకి పోటీ పరీక్షకు ప్రకటన జారీ చేశారు. అప్పటికే ఆమె గర్భవతి. అయినా పట్టువదల కుండా ఆ పోటీ పరీక్షకు దరఖాస్తు చేసింది. సరిగ్గా పరీక్ష సమయానికి డెలివరీ డేట్ వస్తుందని ఆందోళన చెందింది.**

తల్లిదండ్రులు, తనకు ఇష్టమైన టీచర్ మహాలక్ష్మి, భర్త వెంకట్రామన్ శ్రీపతికి ధైర్యం చెప్పారు. పోటీ పరీక్షకు ప్రిపేర్ కావాలని ప్రోత్సహించారు. శ్రీపతి ఆ పరీక్షని ఓ యజ్ఞంలా భావించింది. తల్లి మల్లిక అండతో రాత్రి పగలు చదివి పరీక్షకు సిద్ధమైంది. ఓ పక్క పరీక్ష తేదీ, మరో పక్క డెలివరీ డేట్ దగ్గర పడుతున్నాయి. పరీక్ష తేదీ కంటే డెలివరీ సమయమే రెండు రోజులు ముందు వచ్చింది. అయినా, పుస్తకాలు వదల్లేదు. ప్రిపరేషన్ కొనసాగించింది.

2023 నవంబరు 27 శ్రీపతి పండంటి పాపకు జన్మనిచ్చింది. రెండు రోజులకే 29న పరీక్ష. పరీక్ష రాయాలని శ్రీపతి పట్టుబట్టింది. వద్దని వైద్యులు హెచ్చరించినా వినలేదు. తాను కష్టపడి చదివిన చదువు వృథా కాకూడదని అనుకుంది. తల్లిదండ్రులు, భర్త సహకారంతో పసిగుడ్డుతో ప్రయాణమైంది. పచ్చి బాలింత అయిన శ్రీపతి యలగిరి హిల్స్ నుంచి కారులో నాలుగున్నర గంటలు ప్రయాణించి పోటీ పరీక్ష రాసింది. విజయం సాధించింది. 2024 ఫిబ్రవరి 15న సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికైంది. రాష్ట్రంలో జడ్జి అయిన మొట్టమొదటి గిరిజన మహిళగా రికార్డులకెక్కింది. యువతకు ఆదర్శ మహిళ అయింది. తమిళనాడు ప్రభుత్వ 'ద్రవిడ మోడల్' విధానంలో రూపొందించిన 'ద తమిళ మీడియం యాక్ట్' ప్రకారం తమిళ మీడియంలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ఈ చట్టం శ్రీపతి జడ్జిగా ఎంపిక కావడానికి ఉపయోగపడిందని భావిస్తున్నారు. ఎందరు చెప్పినా వినకుండా ప్రాణాలకు తెగించి 200 కిలోమీటర్లు ప్రయాణించి పరీక్ష రాసిన రెండు రోజుల బాలింత శ్రీపతి సంకల్పం నేటి తరానికి ఆదర్శం. పెండ్లి చేసుకున్న తర్వాత కూడా చదువు ఆపకుండా, పోటీ పరీక్షలకు సిద్ధమై విజయం సాధించిన శ్రీపతికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అభినందనలు.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)




# జీన్స్ ధరించండి.. కానీ, మీ 'జీన్స్'ను మరవొద్దు



మీరేం ధరిస్తారన్న విషయంలో నాకేమీ ఆందోళన లేదు. జీన్స్ ధరించండి. కానీ మీ 'జీన్స్' (మూలాల)ను మర్చిపోవద్దు. సంస్కృతీ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను మర్చిపోతేనే అసలు సమస్య.

- చిదానంద సరస్వతి, ప్రముఖ ఆధ్యాత్మకవేత్త